


జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




ఆదివారం 15 మార్చి 2026 | పేజీలు 04 | వెల - 2/- | సంపుటి 01 సంచిక 286 | ప్రచురణ - తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

## నర్మెట్టలో 300 కోట్లతో నిర్మించిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ఈనెల 22న ముఖ్యమంత్రి ప్రారంభం

### రైతులకు అవగాహన కల్పించేందుకు ఫ్యాక్టరీ ప్రాంగణంలో మూడు రోజుల రైతు మేళా





సందేశం టైమ్స్, సిద్ధిపేట, 15 మార్చి: సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో సుమారు 300 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలోని ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని రాష్ట్ర ముఖ్యమంత్రి త్వరలో ప్రారంభించనున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి కలిసి ఫ్యాక్టరీని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. హైమావతి, ఆయిల్ ఫెడ్ నిర్వహణాధికారి యాష్మీన్ భాషా, సిద్ధిపేట పోలీసు కమిషనర్ సాధన రష్మి పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలోనే అత్యాధునిక సాంకేతికతతో నర్మెట్టలో నిర్మించిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ఈనెల 22వ తేదీన ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సమయం కోరినట్లు తెలిపారు. అదే రోజు సుమారు 40 కోట్ల రూపాయలతో ఆయిల్ రిఫైనరీ యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీల్లో ముడి నూనె మాత్రమే తయారవుతుండగా, కొత్త యూనిట్ ద్వారా మరింత విలువైన ఉత్పత్తులు తయారు చేయవచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, మద్దతు ధరలు, సన్న వడ్లకు బోనస్ వంటి చర్యల వల్ల తెలంగాణ రాష్ట్రంలో వరి సాగు విస్తృతంగా పెరిగిందని, అయితే కేంద్ర ప్రభుత్వం బియ్యం కొనుగోలు విషయంలో స్పష్టత లేకపోవడంతో రైతులు పంట మార్పిడి వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా చీడపీడలు, అడవి పందులు, కోతులు, వడగండ్ల వానల వంటి సమస్యలు తక్కువగా ఉండే ఆయిల్ ఫామ్ సాగు రైతులకు స్థిరమైన అధిక ఆదాయం అందిస్తుందని పేర్కొన్నారు. రైతులు ధైర్యంగా ముందుకు వచ్చి ఆయిల్ ఫామ్ పంటలను సాగు చేయాలని కోరారు. వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు నర్మెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి మొదటి సంతకం చేశానని, అప్పట్లో 12 వేల రూపాయలుగా ఉన్న ధర ప్రస్తుతం 21,546 రూపాయలకు పెరిగిందని తెలిపారు. ధరను 25 వేల రూపాయలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ వాతావరణం ఆయిల్ ఫామ్ సాగుకు అనుకూలమని, రాష్ట్రంలో సుమారు 20 లక్షల ఎకరాల్లో ఈ పంట సాగు చేయడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. దేశంలో వంట నూనెల కోసం ప్రతి సంవత్సరం లక్షల కోట్ల రూపాయలు విదేశాలైన మలేషియా, ఇండోనేషియా వంటి దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రానికి మధ్య ప్రాంతంలో ఉన్న సిద్ధిపేటలో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ వల్ల రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల రైతులకు ఉపయోగం కలుగుతుందని అన్నారు. ఫ్యాక్టరీ ప్రారంభోత్సవంతో పాటు 20, 21, 22 తేదీలలో ఫ్యాక్టరీ ప్రాంగణంలో రైతు మేళా నిర్వహించి వ్యవసాయ యంత్రాలు ప్రదర్శనతో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, అనుభవం ఉన్న ఆయిల్ ఫామ్ రైతుల ద్వారా అవగాహన కల్పిస్తామని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గుజరాత్ రాష్ట్రంలో అమూల్ సంస్థ గ్రామీణ స్థాయి నుండి పాల సేకరణ చేసి దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకుందని, అదే విధంగా తెలంగాణలో ఆయిల్ ఫామ్ అభివృద్ధికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి చేస్తున్నారని తెలిపారు. గతంలో ప్రతిపాదనలు ఉన్నప్పటికీ 300 కోట్ల రూపాయలు కేటాయించి ఈ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని పూర్తి చేయించారని చెప్పారు. ఈ ఫ్యాక్టరీ వల్ల ప్రాంతీయ రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని, ఆయిల్ ఫామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో రైతులు ఆయిల్ ఫామ్ సాగు వైపు ముందుకు రావాలని సూచించారు. ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ అంటేనే తుమ్మల నాగేశ్వరరావు గుర్తుకు వస్తారని, ఫ్యాక్టరీ నిర్మాణం త్వరగా పూర్తి కావడానికి ఆయన ప్రత్యేకంగా కృషి చేశారని తెలిపారు. రైతులు సంతోషంగా ఉండాలంటే ఆయిల్ ఫామ్ పంటలు సాగు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ వరి సాగు మాత్రమే చేస్తూ ఉండడం రైతులకు అలవాటైందని, భవిష్యత్తులో లాభదాయకమైన వ్యవసాయం కొనసాగించాలంటే పంట మార్పిడి తప్పనిసరి అని అన్నారు. ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణం ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయం అని, రైతులు ఆయిల్ ఫామ్ సాగు వైపు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్ధిపేట ఆర్డీవో సదానందం, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపారాణి, ఆయిల్ ఫెడ్ అధికారులు సుధాకర్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల అదనపు కేటాయింపుకు కేంద్రానికి లేఖ

### బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు – ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్

సందేశం టైమ్స్, హైదరాబాద్, 15 మార్చి 2026: అంతర్జాతీయ స్థాయిలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల ప్రభావంతో ద్రవ పెట్రోలియం వాయువు సరఫరాపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత నేపథ్యంలో అదనపు సిలిండర్ల కేటాయింపునకు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు అధికారులు తెలిపారు. ప్రజల్లో భయాందోళనల కారణంగా గ్యాస్ బుకింగ్‌లు సాధారణం కంటే రెట్టింపు అయినట్లు వెల్లడించారు. గృహ వినియోగ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. అలాగే కమర్షియల్ గ్యాస్‌ను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా కఠినంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో పౌర సరఫరాల శాఖ భవనంలో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ గది ఏర్పాటు చేసి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఫిర్యాదుల స్వీకరణ కోసం 1800-428-00-333 అనే టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా సుమారు 20 శాతం వరకు మాత్రమే అందుతోందని హోటల్ మరియు రెస్టారెంట్ సంఘాలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే గృహ వినియోగదారులకు గ్యాస్ సరఫరా నిలకడగా కొనసాగేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆసుపత్రులు, పాఠశాలలు, వృద్ధాశ్రమాలు మరియు సంక్షేమ సంస్థలకు అవసరమైన గ్యాస్ సరఫరా నిరాటంకంగా కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. పరిస్థితులను సమీక్షించేందుకు ఉన్నత స్థాయి కమిటీని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో సచివాలయంలో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ సంఘం ప్రతినిధులతో సమావేశమై గ్యాస్ సరఫరా పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు.

## ఇందిరమ్మ ఇండ్ల పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ 2764 మంది లబ్ధిదారులకు రూ.28.50 కోట్ల విడుదల ఎల్-3 కేటగిరీ 1200 మందికి ఊరట

సందేశం టైమ్స్, హైదరాబాద్, 15 మార్చి 2026: ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ కార్యక్రమం చేపట్టినట్లు గృహ నిర్మాణ సంస్థ నిర్వహణాధికారి విపి గౌతం శనివారం తెలిపారు. గత వారం రోజుల్లో మొత్తం 2764 మంది లబ్ధిదారులకు సంబంధించిన సుమారు రూ.28.50 కోట్ల పెండింగ్ బిల్లులను క్లియర్ చేసినట్లు వెల్లడించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రతి విభాగంలో సమర్థంగా అమలు చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల బిల్లుల విడుదలలో ఉన్న జాప్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచనలతో 99 రోజుల కార్యక్రమంలో మొదటి వారం రోజుల్లో ఇందిరమ్మ ఇండ్ల పెండింగ్ బిల్లులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. సాధారణంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణ పురోగతిని అనుసరించి విడతల వారీగా బిల్లులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారని తెలిపారు. అయితే లబ్ధిదారుల ఆధార్ సంఖ్య బ్యాంకు ఖాతాలకు అనుసంధానం కాకపోవడం, పేర్లలో తేడాలు ఉండటం, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ఫోటోలు సరిగా లేకపోవడం, కృత్రిమ మేధస్సు పరిశీలనలో అభ్యంతరాలు రావడం, గత పథకాలలో లబ్ధి పొందిన వివరాలు ఉండటం, ఎల్-3 కేటగిరీ నుండి ఎల్-1 కేటగిరీ జాబితాల్లోకి వచ్చిన వారి వివరాల పరిశీలన వంటి పలు కారణాల వల్ల బిల్లుల విడుదలలో ఆలస్యం జరిగినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను క్లియర్ చేయాలనే లక్ష్యంతో ప్రత్యేక చర్యలు తీసుకుని నిశితంగా పరిశీలించి విడుదల చేసినట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఎల్-3 జాబితాలో ఉన్న 1200 మంది లబ్ధిదారులకు సంబంధించిన రూ.12.06 కోట్లను విడుదల చేసినట్లు తెలిపారు. అలాగే ఇప్పటికే బిల్లులు విడుదలైనప్పటికీ బ్యాంకు వద్ద చెల్లింపులు విఫలమైన 653 మంది లబ్ధిదారులకు సంబంధించిన సుమారు రూ.7 కోట్ల మొత్తాన్ని కూడా తిరిగి విడుదల చేసినట్లు చెప్పారు. అదేవిధంగా పలు అభ్యంతరాలు, పరిశీలన కారణంగా పెండింగ్‌లో ఉన్న మరో 911 మంది లబ్ధిదారులకు సంబంధించిన రూ.9.40 కోట్ల బిల్లులను కూడా విడుదల చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో బ్యాంకుల ద్వారా చెల్లింపుల విషయంలో ఇలాంటి సమస్యలు రాకుండా ఉండేందుకు లబ్ధిదారులు తమ ఆధార్ అనుసంధానం, పేర్లు మరియు ఇతర వివరాలను ఒకసారి బ్యాంకుల్లో పరిశీలించుకోవాలని నిర్వహణాధికారి విజ్ఞప్తి చేశారు.

# గీతం విశ్వవిద్యాలయంలో పౌర రక్షణ స్వచ్ఛంద సేవకుల శిక్షణ మూడో రోజు విజయవంతం





సందేశం టైమ్స్, హైదరాబాద్, 15 మార్చి 2026 (టీ సంగమేశ్వర్): తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర మరియు పౌర రక్షణ శాఖ ఆధ్వర్యంలో గీతం విశ్వవిద్యాలయం హైదరాబాద్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న పౌర రక్షణ స్వచ్ఛంద సేవకుల శిక్షణ కార్యక్రమం మూడో రోజు విజయవంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా శాఖకు చెందిన అధికారులు ప్రాథమిక పౌర రక్షణ మరియు విపత్తుల నివారణ అంశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. విపత్తుల నిర్వహణ సూత్రాలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహజ మరియు మానవ సృష్టి విపత్తుల సమయంలో స్వచ్ఛంద సేవకుల పాత్ర వంటి అంశాలపై వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సంగారెడ్డి అగ్నిమాపక కేంద్ర అధికారి ఎస్. బిక్షపతి మరియు ఇతర అధికారులు పాల్గొని తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. అలాగే రక్షణ పరికరాలైన రక్షణ పడవ మరియు దూర నియంత్రిత ప్రాణ రక్షణ వల వినియోగంపై ప్రదర్శనలు నిర్వహించారు. రుద్రారం సరస్సు వద్ద నీటిలో చిక్కుకున్న బాధితులను ఎలా రక్షించాలో ప్రాయోగిక ప్రదర్శన ఇచ్చారు. దూర నియంత్రిత ప్రాణ రక్షణ వల వినియోగం, రక్షణ పడవను సురక్షితంగా నడపడం, నీటిలో ఉన్న బాధితులను సమీపించడం, వారిని సురక్షిత ప్రదేశానికి తరలించడం వంటి అంశాలపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న గీతం విశ్వవిద్యాలయం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని నీటిలో రక్షణ చర్యల సమయంలో పాటించాల్సిన భద్రతా జాగ్రత్తలను తెలుసుకున్నారు. ముఖ్యంగా సురక్షిత దూరం పాటించడం, తేలియాడే రక్షణ పరికరాల వినియోగం, రక్షణ బృంద సభ్యుల మధ్య సమన్వయం, వరదలు లేదా మునిగే ప్రమాదాల సమయంలో వేగవంతమైన స్పందన వంటి అంశాలను అధికారులు వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమం యువతలో విపత్తుల సమయంలో స్పందించే సామర్థ్యాన్ని పెంపొందించడం మరియు సమాజంలో అవగాహన పెంచడం లక్ష్యంగా కొనసాగుతున్నదని నిర్వాహకులు తెలిపారు.

# రోడ్డు విస్తరణలో తొలగించిన అంబేద్కర్ విగ్రహాన్ని మధ్యలోనే ప్రతిష్ఠించాలి దళిత నాయకుల డిమాండ్





సందేశం టైమ్స్, వట్పల్లి, 15 మార్చి 2026 (టీ సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులలో భాగంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని తాత్కాలికంగా తొలగించి పక్కన ఉంచడంతో దళిత నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు వెడల్పు పనులు పూర్తయ్యాక అంబేద్కర్ విగ్రహాన్ని మళ్లీ నడి మధ్యలోనే ప్రతిష్ఠించాలని వారు అధికారులను కోరారు. ఈ విషయమై వట్టిపల్లి మండల దళిత నాయకులు దాసు, మండల్ మాల మహానాడు అధ్యక్షుడు చంటి, అనిల్ కుమార్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్) వట్టిపల్లి మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల శివయ్య తదితరులు కలిసి వట్టిపల్లి ఎస్సై లవకుమార్ మరియు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, డీఈ అధికారులను కలిసి తమ అభ్యర్థనను తెలియజేశారు. అయితే అధికారులు దీనిపై అంగీకారం తెలపకపోవడంతో అంబేద్కర్ వారసులు తగిన నిర్ణయం తీసుకోవాలని దళిత నాయకులు కోరారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాక అంబేద్కర్ విగ్రహాన్ని అదే స్థలంలో మధ్యలోనే ప్రతిష్ఠించాలని, లేనిపక్షంలో దళిత సంఘాలు కలిసి తదుపరి చర్యలు తీసుకుంటామని నాయకులు హెచ్చరించారు.

# హ్యాండ్లూమ్ టెక్నాలజీ డిప్లొమా కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానం

సందేశం టైమ్స్, సూర్యాపేట, 15 మార్చి 2026: హైదరాబాద్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ భారతీయ చేతి నేసిన వస్త్ర సాంకేతిక విద్యా సంస్థలో 2026-27 విద్యా సంవత్సరానికి విద్యార్థులు ప్రవేశాల కోసం దరఖాస్తులు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చేతి నేసిన వస్త్ర సాంకేతికంలో మూడేళ్ల డిప్లొమా కోర్సు ఉండగా మొత్తం ఆరు సెమిస్టర్లు ఉంటాయని, మొత్తం సీట్లు 60 ఉన్నాయని వెల్లడించారు. పదో తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఇంగ్లీషు ఒక విషయంగా ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. ప్రవేశాలు పూర్తిగా పదో తరగతి మార్కుల ప్రతిభ ఆధారంగా ఉంటాయని పేర్కొన్నారు. 10+2 (ఎంపీసీ) పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా రెండో సంవత్సరంలో చేరే అవకాశం ఉందని తెలిపారు. సాధారణ అభ్యర్థులకు గరిష్ఠ వయస్సు 23 సంవత్సరాలు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 సంవత్సరాల వరకు వయస్సు సడలింపు ఉంటుందని చెప్పారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి నెలకు రూ.2,500 ఉపకార వేతనం తెలంగాణ ప్రభుత్వం అందిస్తుందని వెల్లడించారు. పూర్తి వివరాల కోసం సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని, ఈమెయిల్ లేదా ఫోన్ ద్వారా కూడా సంప్రదించాలని కోరారు. ఈ ప్రకటనను సూర్యాపేట జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం విడుదల చేసింది.

# రంజాన్ సందర్భంగా అనాథ పిల్లలకు బట్టలు, రగ్గులు, పండ్ల పంపిణీ



సందేశం టైమ్స్ హత్నూర, మార్చి 15 (టీ సంగమేశ్వర్ ) సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం పల్పనూరు గ్రామంలోని మదర్సాలో రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని పేద మరియు అనాథ పిల్లలకు రగ్గులు, బట్టలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమాన్ని చార్మినార్ ఎక్స్‌ప్రెస్ ఈవీ9 న్యూస్ ఛానల్ స్టేట్ ఇంచార్జ్ షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రంజాన్ మాసంలో పేదలకు సహాయం చేయడం గొప్ప పుణ్యకార్యమని తెలిపారు. సమాజంలో ఉన్నవారు అవసరమైన వారికి చేయూతనిస్తే ఐక్యత మరియు సౌభ్రాతృత్వం మరింత బలపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సివిల్ ప్రొటెక్షన్ లీగల్ సర్వీస్ సంగారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, పద్మశాలి రవీందర్, శివకుమార్, మదర్సా మౌల్ సాబ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ యువతి యువకులకు వార్షిక ప్రణాళిక 2025-26 దరఖాస్తులకు ఆహ్వానం

సందేశం టైమ్స్, సూర్యాపేట, 15 మార్చి 2026: జిల్లాలోని షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి షెడ్యూల్డ్ కులముల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించిన పథకాల కోసం అర్హులైన ఎస్సీ యువతి యువకులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యాచరణ ప్రణాళిక కింద రూ.50 వేల నుండి రూ.1 లక్ష వరకు యూనిట్లకు 90 శాతం సబ్సిడీ, రూ.1 లక్ష నుండి రూ.2 లక్షల వరకు యూనిట్లకు 80 శాతం సబ్సిడీ, రూ.2 లక్షల నుండి రూ.4 లక్షల వరకు యూనిట్లకు 70 శాతం సబ్సిడీ, రూ.4 లక్షల పైబడిన యూనిట్లకు 60 శాతం సబ్సిడీతో గరిష్టంగా రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలకు 100 శాతం సబ్సిడీ వర్తిస్తుందని, మిగిలిన మొత్తాన్ని బ్యాంక్ రుణంగా పొందవచ్చని పేర్కొన్నారు. వ్యవసాయేతర పథకాల కోసం అభ్యర్థుల వయస్సు 21 నుండి 50 సంవత్సరాలు, వ్యవసాయ ఆధారిత పథకాల కోసం 21 నుండి 60 సంవత్సరాలు ఉండాలని తెలిపారు. స్వయం ఉపాధి కోసం నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలకు 18 నుండి 45 సంవత్సరాలు, వేతన ఉపాధి కార్యక్రమాలకు 18 నుండి 35 సంవత్సరాల వయస్సు ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు లేదా ఫుడ్ సెక్యూరిటీ కార్డు, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, రవాణా పథకాల కోసం శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్, అవసరమైతే పట్టాదారు పాసుబుక్, సదరేం ధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తదితర పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జొమాటో, స్విగ్గీ, రాపిడో, ఉబెర్ వంటి ప్లాట్‌ఫారమ్‌లలో పనిచేస్తున్న గిగ్ వర్కర్లకు ఈ పథకాల్లో ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. గత ఐదేళ్లలో ఒక కుటుంబానికి ఒకే స్వయం ఉపాధి పథకం మాత్రమే మంజూరు అవుతుందని, దళిత బంధు పథకం లబ్ధిదారులు ఈ పథకానికి అర్హులు కారని స్పష్టం చేశారు. ఆసక్తి గల సూర్యాపేట జిల్లా ఎస్సీ నిరుద్యోగ యువతి యువకులు https://tgobmms.cgg.gov.in� వెబ్‌సైట్ ద్వారా మార్చి 17 నుండి మార్చి 24 వరకు ఆన్లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. ఆన్లైన్‌లో సమర్పించిన దరఖాస్తును డౌన్‌లోడ్ చేసి అవసరమైన పత్రాల ప్రతులతో కలిపి కలెక్టర్ కార్యాలయం ఐడీఓసీ భవనంలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సమర్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# తాలేల్మ గ్రామంలో ఘనంగా మల్లన్న స్వామికి బోనాల సమర్పణ కురుమ సంఘం అధ్యక్షులు బోడోల్ల మల్లేశం

## మల్లన్న స్వామి ఆశీస్సులతో గ్రామానికి శాంతి, సుభిక్షాలు కలగాలని ప్రార్థనలు





సందేశం టైమ్స్ మర్చి అందోల్ మండలం మర్చి 15( టి సంగమేశ్వర్) ఆందోల్ మండల్ తాలేల్మ గ్రామంలో శనివారం. కురుమ సంఘం ఆధ్వర్యంలో. దేవదేవుని మల్లన్న స్వామి ప్రతమ వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలో భక్తిశ్రద్ధలతో కులాలకు అతీతంగా బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం అధ్యక్షులు బోడోల్ల మల్లేశం, మాట్లాడుతూ మా తాలేల గ్రామంలో గ్రామస్తుల సహకారంతో. కురుమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా మల్లన్న స్వామి దేవాలయం గత సంవత్సరం నిర్మించాము ప్రతమ సంవత్సరం సందర్భంగా స్వామి వారికి జాతర నిర్వహిస్తామని ఆయన అన్నారు. స్వామివారికి ఇలాగే ఐదు సంవత్సరాల వరకు జాతర నిర్వహిస్తామని ఆయన తెలిపారు. మా గ్రామంలోని వచ్చే ఏడు సకాలంలో వర్షాలు కురిసి నిండుగా పంటలు పండాలని, బోనాలు సమర్పించిన నా ఆడపడుచులను సుమంగళిగా, సుఖశాంతులతో. ఉండాలని ఆ మల్లన్న స్వామి ఆశీస్సులు నా ఆడపడుచులపై ఎల్లవేళలా ఉండాలని.ఆయన కోరుకున్నారు ఈ కార్యక్రమంలో బోడొల్ల సంగమేశ్ శంకర్ క్రిష్ణ మల్లేశం, పడకంటి మల్లేశం, దండు నాగభూషణం, షాబాదీ అంజయ్య, విఠల్ కురుమ సంఘం సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు



# బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మన్నే జగదీశ్వర్ జన్మదిన కార్యక్రమం

సందేశం టైమ్స్, వట్పల్లి, 15 మార్చి 2026 (సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం మర్వెల్లి గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మన్నే జగదీశ్వర్ జన్మదినాన్ని పురస్కరించుకుని పార్టీ నాయకులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి, నాయకులను శాలువాతో సన్మానించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రి టీ. హరీష్ రావు ను మర్యాదపూర్వకంగా కలసి ఆశీర్వాదాలు పొందారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ మఠం బిక్షపతి, మేడీకుంద కిరణ్ బీఆర్ఎస్ నాయకుడు, బీఆర్ఎస్ కార్యకర్తలు మేతరి లక్ష్మణ్, అనిల్ కుమార్, శ్రీశైలం మరియు ఇతరులు పాల్గొన్నారు. "బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మన్నే జగదీశ్వర్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం" అని నాయకులు తెలిపారు

# డ్వాక్రా గ్రూపుల్లో డబ్బుల వివాదం – మహిళల మధ్య ఘర్షణ, ఆరుగురికి గాయాలు



సందేశం టైమ్స్, అందోల్, 15 మార్చి 2026 (టీ సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా అందోల్-జోగిపేట పట్టణంలోని పంచముఖి హనుమాన్ దేవాలయం సమీపంలో డ్వాక్రా గ్రూప్ మహిళల మధ్య డబ్బుల వ్యవహారంపై తీవ్ర ఘర్షణ చోటుచేసుకుని ఆరుగురు మహిళలు గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానిక సమాచారం ప్రకారం గత కొన్ని నెలలుగా డ్వాక్రా గ్రూప్ సభ్యులు చెల్లించిన డబ్బుల విషయంలో లీడర్లు మరియు సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొని చివరకు ఘర్షణకు దారితీసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో మహిళలు కట్టెలతో పరస్పరం దాడి చేసుకున్నట్లు సమాచారం. డ్వాక్రా గ్రూప్ లీడర్లు సభ్యుల నుంచి డబ్బులు వసూలు చేసి బ్యాంకుల్లో జమ చేయకుండా తమ వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తున్నారని కొందరు మహిళలు ఆరోపించారు. ప్రతినెల సభ్యులు డబ్బులు చెల్లిస్తున్నప్పటికీ బ్యాంకులో జమ చేయడం లేదని, దీనిపై ప్రశ్నిస్తే "మేమే లీడర్లు, మేమే చూసుకుంటాం, మీరు ఎందుకు అడుగుతున్నారు" అంటూ తిరస్కారంగా సమాధానం ఇస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మోసపూరితంగా వ్యవహరిస్తున్న లీడర్లు మరియు సంబంధిత సీఏలను గ్రూప్ నుంచి తొలగించాలని బాధిత మహిళలు డిమాండ్ చేశారు. ఘటనపై స్థానికంగా చర్చ జరుగుతుండగా సంబంధిత అధికారులు విచారణ చేపట్టాలని మహిళలు కోరుతున్నారు.




## కౌడిపల్లిలో నీలం మధు జన్మదిన వేడుకలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, 15 మార్చి 2026 (సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి కె. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా కౌడిపల్లి బస్టాండ్ వద్ద కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు, మెదక్ పార్లమెంట్ మాజీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ జన్మదిన వేడుకలను ముదిరాజ్ సంఘం మరియు ఎన్ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రోగులు మరియు వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమం ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు మాటూరి శాఖయ్య, ఎన్ఎంఆర్ యువసేన మండల అధ్యక్షుడు పాము శేఖర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం కౌడిపల్లి గ్రామ అధ్యక్షుడు మల్లేశం, నాయకులు హనుమనుల రాములు, పాండు, లక్ష్మణ్, దొంతుల దుర్గయ్య, రాజు, నర్సింలు, వార్డు సభ్యుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన ముదిరాజ్ సంఘం సభ్యులు, కుల బాంధవులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## వేసవిలో ప్రజలకు ఉపశమనం – ఇంద్రేశంలో చలివేంద్రం ఏర్పాటు




సందేశం టైమ్స్, పటాన్చెరు, 15 మార్చి 2026 (బి. డేవిడ్): పటాన్చెరు మండలం ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో శ్రీ రాచమల్ల అనిల్ గౌడ్ ఆధ్వర్యంలో వేసవిలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఇంద్రేశం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పట్లోళ్ల హరీష్ రెడ్డి, విలేజ్ ప్రెసిడెంట్ జంగయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ హరీష్ రెడ్డి మాట్లాడుతూ వేసవిలో ప్రజలు దాహంతో ఇబ్బంది పడకుండా ఉపశమనం కలిగించే ఉద్దేశంతో ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంద్రేశం మున్సిపాలిటీ ప్రజలందరికీ పార్టీలకు అతీతంగా ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ప్రజల సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే స్పందించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాచమల్ల అనిల్ గౌడ్, రాచమల్ల రవి గౌడ్, కిరణ్ రెడ్డి, కురుమ మహేష్, సాయి, చర్యాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షలు భయం కాదు – ప్రతిభను నిరూపించుకునే గొప్ప అవకాశం: హాలియా దాసరి మేకలి రాములు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, 15 మార్చి 2026 (బి. సంగమేశ్వర్): జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలో మాజీ కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ జహీరాబాద్ మండలానికి చెందిన హాలియా దాసరి మేకలి రాములు పదో తరగతి వార్షిక పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు అంటే భయపడాల్సిన అవసరం లేదని, అవి విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకునే గొప్ప అవకాశమని పేర్కొన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ ధైర్యంగా పరీక్షలు రాయాలని, కష్టపడి చదివిన శ్రమ తప్పకుండా మంచి ఫలితాలను అందిస్తుందని అన్నారు. ఎలాంటి ఒత్తిడి లేదా భయాందోళనలకు లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి తమ తల్లిదండ్రులకు, గురువులకు, పాఠశాలకు మరియు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పదో తరగతి వార్షిక పరీక్షలు రాస్తున్న విద్యార్థినీ విద్యార్థులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ వారికి ఆల్ ది బెస్ట్ అన్నారు.



## ఫైనల్లో భారత్‌పై ఇంగ్లాండ్ 2–0 విజయం

సందేశం టైమ్స్, హైదరాబాద్, 15 మార్చి 2026: హైదరాబాద్‌లో జరిగిన మహిళల హాకీ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ జట్టుపై ఇంగ్లాండ్ జట్టు 2–0 తేడాతో విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన ఇంగ్లాండ్ జట్టు మొదటార్థంలోనే రెండు గోల్స్ సాధించి ఆధిక్యం సంపాదించింది. భారత్ జట్టు సమానంగా పోరాడినా గోల్స్ సాధించడంలో విఫలమైంది. రక్షణాత్మకంగా ఆడిన ఇంగ్లాండ్ ఆటగాళ్లు భారత్‌కు అవకాశాలు ఇవ్వకుండా మ్యాచ్‌ను తమ ఆధీనంలో ఉంచి చివరకు 2–0 తేడాతో విజయం నమోదు చేశారు. ఈ విజయంతో ఇంగ్లాండ్ జట్టు చాంపియన్‌గా నిలిచింది.



## సంజీవ్–నిర్మల దంపతుల 25వ వివాహ వార్షికోత్సవ వేడుకలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, 15 మార్చి 2026 (బి. సంగమేశ్వర్): జహీరాబాద్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు గజ్రే సంజీవ్ కుమార్ పాటిల్ మరియు నిర్మల దంపతుల 25వ వివాహ వార్షికోత్సవ వేడుకలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మరియు స్నేహితుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తోటి జర్నలిస్టులు సతార్ శీను, ప్రవీణ్ పాటిల్ దంపతులను శాలువాలు కప్పి సన్మానించి పుష్పగుచ్ఛాలు, బహుమతులు అందజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టు ప్రవీణ్ పాటిల్ మాట్లాడుతూ సంజీవ్ కుమార్ పాటిల్ నిష్పక్షపాతంగా పనిచేస్తూ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే సీనియర్ జర్నలిస్టుగా గుర్తింపు పొందారని కొనియాడారు. 25 సంవత్సరాల సుఖసంపన్నమైన దాంపత్య జీవితం పూర్తి చేసుకున్న ఈ దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## రిటైర్డ్ ఉద్యోగుల దాచుకున్న సొమ్ము వెంటనే విడుదల చేయాలి



సందేశం టైమ్స్, నాగులవంచ, 15 మార్చి 2026: రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని పి.ఆర్.పి.ఏ జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు వైపీ తెలిపారు. నాగులవంచలో జరిగిన పి.ఆర్.పి.ఏ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 మార్చి తర్వాత రిటైర్ అయిన ఉద్యోగులు దాచుకున్న సొమ్మును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా 700 కోట్ల రూపాయలు మంజూరు చేయడం సమస్యకు పరిష్కారం కాదని, ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్లకు ఉద్యోగ సమయంలో దాచుకున్న గ్రాట్యువిటీ, కమ్యూటేషన్, జి.ఐ.ఎస్, లీవ్ ఎన్‌క్యాష్మెంట్ వంటి బకాయిలను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత 22 నెలలు గడిచినా ఈ బకాయిలు చెల్లించకపోవడం వల్ల పెన్షనర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ మనోవేదన చెందుతున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని రిటైర్డ్ ఉద్యోగుల దాచుకున్న సొమ్మును విడుదల చేసి వారికి ఆర్థిక ఉపశమనం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎస్. మధుసూదన్ రెడ్డి, జి. చంద్రశేఖర్, నంజాల పుల్లయ్య, అంబటి శాంతయ్య, డి. శివనారాయణ రెడ్డి, ఎం. బాబురావు, తాత రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇసోజిపేట్ గ్రామంలో సీసీ రోడ్ పనులకు శ్రీకారం



సందేశం టైమ్స్, అందోల్, 15 మార్చి 2026 (అందోల్ ప్రతినిధి బి. రమేష్ బాబు): సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గ పరిధిలోని పుల్కల్ మండలం ఇసోజిపేట్ గ్రామంలో సీసీ రోడ్ నిర్మాణ పనులను మంత్రి దామోదర్ రాజనరసింహ ఆదేశాల మేరకు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎల్. విజేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ రవికుమార్, వార్డ్ సభ్యులు, పుల్కల్ మండల అధ్యక్షుడు దుర్గా రెడ్డి, రామచంద్రారెడ్డి, నాయకులు గోవర్ధన్, ఎస్. గణపతి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపిటిసి రవికుమార్, మాజీ ఉప సర్పంచ్ ఎల్లయ్య, పార్టీ సీనియర్ నాయకులు సుఖేందర్ రెడ్డి, టీ. యాదయ్య, లక్ష్మణ్ రెడ్డి, ఎండి చాంద్ పాషా, చి. పండరి, ఎండి అక్బర్, ఎం. రాజు, వి. రాములు, జె. సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం సీసీ రోడ్లు నిర్మించడం వల్ల ప్రజలకు సౌకర్యాలు మెరుగుపడతాయని నాయకులు తెలిపారు.

## గృహ ఎల్‌పిజి సిలిండర్లను వాణిజ్య వినియోగానికి ఉపయోగిస్తే కఠిన చర్యలు: ఏసీపీ హెచ్చరిక



సందేశం టైమ్స్, వైరా, 15 మార్చి 2026: ఇటీవల అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో గ్యాస్ సరఫరాలో అంతరాయం కలగవచ్చని ప్రభుత్వం భావించి రాష్ట్రవ్యాప్తంగా గృహ వినియోగ ఎల్‌పిజి సిలిండర్ల సరఫరాను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వైరా డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్.ఎస్. పాణి ఒక ప్రకటనలో తెలిపారు. గృహ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరఫరా వ్యవస్థను కట్టుదిట్టంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. అయితే కొన్నిచోట్ల గృహ వినియోగానికి మాత్రమే కేటాయించిన ఎల్‌పిజి సిలిండర్లను హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, క్యాటరింగ్ యూనిట్లు మరియు ఇతర వ్యాపార సంస్థలు వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నట్లు సమాచారం అందుతున్నదని తెలిపారు. గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగించడం చట్టవిరుద్ధమని, అత్యావశ్యక వస్తువుల చట్టం మరియు సంబంధిత నియంత్రణ ఆదేశాల ప్రకారం ఇది నేరమని హెచ్చరించారు. ఇటువంటి అక్రమ వినియోగం, నిల్వ, రవాణా లేదా విక్రయం చేసిన వారిపై సిలిండర్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైరా డివిజన్ పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాల్స్, రోడ్డు పక్కన ఉన్న ఆహార దుకాణాలు మరియు ఇతర వ్యాపార సంస్థలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అందువల్ల అన్ని వ్యాపార సంస్థలు అధికారికంగా అనుమతించిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్లనే వినియోగించాలని సూచించారు. గృహ సిలిండర్లను అక్రమంగా వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నట్లు గమనించిన పక్షంలో సమీప పోలీస్ స్టేషన్ లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఏసీపీ ఎస్.ఎస్. పాణి స్పష్టం చేశారు.

# దివంగత పొదిల విజయలక్ష్మీకి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నివాళులు





సందేశం టైమ్స్, ఖమ్మం, 15 మార్చి 2026: ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పొదిల రవికుమార్ మాతృమూర్తి పొదిల విజయలక్ష్మి ఇటీవల దివంగతులయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రతో పాటు మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, జిల్లా అధ్యక్షుడు పారా నాగేశ్వరరావు, కాపు జేఏసీ ఛైర్మన్ చందు జనార్ధన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తోట రామారావు తదితర ప్రముఖులు శనివారం ఉదయం ముదిగొండ మండలం ఖానాపురంలోని వారి స్వగ్రామంలో ఆమె భౌతికకాయాన్ని సందర్శించి పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో పార్థివదేహాన్ని ఉంచిన పాడేను రవిచంద్ర, గాంధీ, నాగేశ్వరరావు తదితరులు మోసి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా దివంగత విజయలక్ష్మి భర్త దేవేందర్, కుమారుడు రవికుమార్, కుమార్తె శైలజ మరియు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు రామోజీ రమేష్, సాధుల సారంగపాణి, ఎక్సైజ్ శాఖ అధికారి శ్యామ్, బీఆర్ఎస్ నాయకుడు బచ్చు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు



సందేశం టైమ్స్, చింతకాని, 15 మార్చి 2026: నాగులవంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి కామన్ పరీక్షలు రాయబోతున్న నాగులవంచ, చిన్నమండవ, తిమ్మినేనిపాలెం, పాతర్లపాడు ఉన్నత పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు బీఆర్ఎస్ నాయకులు గులాబి పూలతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ఏకాగ్రతతో పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు వంకాయలపాటి వెంకట లచ్చయ్య, వంకాయలపాటి సత్యనారాయణ, వంకాయలపాటి త్రివేణి, శివ, సామినేని బాబురావు, అంబటి సైదేశ్వరరావు, తోటకూరి నాగేశ్వరరావు (చిన్న) తదితరులు పాల్గొన్నారు.

## ఉగాదికి జాబ్ క్యాలెండర్ విడుదలకు ఏపీ ప్రభుత్వం సిద్ధం

సందేశం టైమ్స్, అమరావతి, 15 మార్చి 2026: రాష్ట్ర ప్రభుత్వం ఉగాది సందర్భంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. మొత్తం 10 వేల ప్రభుత్వ ఉద్యోగాలను మూడు సంవత్సరాల్లో దశలవారీగా భర్తీ చేయాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఇందులో పాఠశాల విద్య మరియు ఇంటర్ విభాగాల్లో 3,000 పోస్టులు, ఎస్ఐలు మరియు కానిస్టేబుళ్లుగా 3,000 పోస్టులు, విశ్వవిద్యాలయ సహాయ ఆచార్యులుగా 1,500 పోస్టులు, ఏఈ పోస్టులు 500, సంక్షేమ వసతి గృహాల వార్డెన్లు 200, అటవీశాఖలో 100, స్టాటిస్టిక్స్ అధికారులుగా 200, గ్రూప్–1లో 100 మరియు గ్రూప్–2లో 500 పోస్టులను భర్తీ చేయాలని ప్రతిపాదించారు. ప్రతి సంవత్సరం ఉగాది సందర్భంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి దశలవారీగా నియామకాలు చేపట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఈ నిర్ణయంతో రాష్ట్ర యువతకు పెద్ద ఎత్తున ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

## ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌పై తొలగింపు నోటీసుకు 193 ఎంపీలు మద్దతు లోక్‌సభలో 130, రాజ్యసభలో 63 మంది ప్రతిపక్ష ఎంపీలు సంతకం చేసి తొలగింపు ప్రక్రియ ప్రారంభం – భారత చరిత్రలో ఇదే మొదటిసారి

సందేశం టైమ్స్, ఢిల్లీ, మార్చి 15 (ప్రతినిధి) – భారతదేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించేందుకు ప్రతిపక్ష పార్టీలు ప్రత్యేక చర్యలు ప్రారంభించాయి. ఈ క్రమంలో మొత్తం 193 మంది ఎంపీలు నోటీసుకు సంతకం చేశారు. వీటిలో 130 మంది లోక్‌సభ సభ్యులు, 63 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. నిబంధనల ప్రకారం, ఒక ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించేందుకు కనీసం 100 లోక్‌సభ సభ్యులు మరియు 50 రాజ్యసభ సభ్యులు సంతకం చేయాలి. అందుకే ఈ నోటీసుకు అవసరమైన సంఖ్యకంటే ఎక్కువ మంది ఎంపీలు మద్దతు ఇచ్చారు.ప్రతిపక్షం పేర్కొన్న కారణాల ప్రకారం, జ్ఞానేష్ కుమార్ పై ఎన్నికల ప్రక్రియలో పాక్షికత్వం, ఓటర్ల జాబితా సవరణలో అన్యాయం, మరియు ఎన్నికల వ్యవస్థలో సమస్యలు వంటి ఆరోపణలు ఉన్నాయి. ఇది భారత పార్లమెంట్ చరిత్రలో పదవిలో ఉన్న ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించేందుకు నోటీసు ఇవ్వడం మొదటిసారిగా జరగడం విశేషం.ఈ నోటీసు సభాధికారుల పరిశీలనలోకి వెళ్లి, అంగీకారమైతే విచారణ కమిటీ ఏర్పాటు అవుతుంది. చివరగా రెండు సభల్లో ప్రత్యేక మెజారిటీ ద్వారా ఆమోదం పొందిన సందర్భంలో మాత్రమే ప్రధాన ఎన్నికల కమిషనర్ యొక్క పదవీ విరమణ జరిగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు ఇది కేవలం తొలగింపు ప్రక్రియ ప్రారంభించడానికి నోటీసు మాత్రమే అని అధికారికంగా పేర్కొనబడింది.

# ఏపీకి రూ.341 కోట్ల కేంద్ర సాయం



సందేశం టైమ్స్, అమరావతి, 15 మార్చి 2026: కేంద్ర ప్రభుత్వం ముఖ్యంగా 2025లో వరదలు, ఆకస్మిక వర్షాలు, 'మోంథా' తుఫాను వంటి ప్రకృతి విపత్తుల కారణంగా నష్టపోయిన రాష్ట్రాలకు అదనపు ఆర్థిక సాయం ప్రకటించింది. జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (ఎన్‌డిఆర్ఎఫ్) నుంచి ఆరు రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలకు మొత్తం రూ.1,912.99 కోట్ల సాయం మంజూరు చేసినట్లు కేంద్ర హోమ్ శాఖ ప్రకటించింది, అందులో ఆంధ్రప్రదేశ్‌కు రూ.341.48 కోట్లు (సుమారు 17.85 శాతం) కేటాయించినట్లు ఉంది. ఈ సాయం వరదలు, తుఫాను మరియు సంబంధిత ప్రమాదాల కారణంగా కార్మికాలు, నిర్మాణాలు మరియు ఇతర హాని అయ్యే ప్రాంతాల్లో పునరుద్ధారణ, సహాయ కార్యక్రమాలు చేపట్టడానికి ఉపయోగిస్తారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, నాగాలాండ్, జమ్మూకశ్మీర్ వంటి రాష్ట్రాలకు కూడా కేంద్రం ఆర్థిక మద్దతు ప్రకటించింది, ఇది ప్రభావిత ప్రాంతాల పునరుత్థానంలో ప్రభుత్వ చర్యలను వేగవంతం చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# సూర్యాపేటలో మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్ – 13 ద్విచక్ర వాహనాలు సీజ్



సందేశం టైమ్స్ సూర్యాపేట, 15 మార్చి 2026 (సూర్యాపేట ప్రతినిధి:) – జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీసులు మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైనర్లు నడుపుతున్న 13 ద్విచక్ర వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు, నిరంతర వాహన తనిఖీలు, జరిమానాలు ప్రజల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం మాత్రమే నిర్వహిస్తున్నదని, పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, మైనర్ డ్రైవింగ్ చట్ట విరుద్ధమని, వాహనాలు నడుపుతున్న పిల్లలకు లైసెన్స్ రాకపోవడం, తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఆరోగ్యంపై అమెరికా అనుమానాలు - తోసిపుచ్చిన ఇరాన్

హైదరాబాద్, సందేశం టైమ్స్, మార్చి 15, 2026, ప్రతినిధి శెట్టి వెంకటేష్: ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన మొజ్తాబా ఖమేనీ క్షేమ సమాచారంపై అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన వైమానిక దాడుల్లో మొజ్తాబా తీవ్రంగా గాయపడ్డారని, ఆయన ముఖం గుర్తుపట్టలేనంతగా వికృతంగా మారి ఉండవచ్చని పీట్ హెగ్సెత్ అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలోనే ఆయన మొదటి అధికారిక ప్రకటన కేవలం లిఖితపూర్వకంగా వెలువడటంపై పీట్ అనుమానాలు వ్యక్తం చేశారు. అత్యాధునిక రికార్డింగ్ వసతులు ఉన్నప్పటికీ వీడియో లేదా ఆడియో సందేశం విడుదల చేయకపోవడం మొజ్తాబా గాయపడి పరారీలో ఉన్నారనే వాదనకు బలాన్నిస్తోందని, ఆయన నాయకత్వానికి చట్టబద్ధత లేదని అమెరికా విమర్శించింది. అయితే, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఈ వ్యాఖ్యలను కొట్టిపారేస్తూ, సుప్రీం లీడర్ క్షేమంగానే ఉన్నారని స్పష్టం చేశారు. మరికొన్ని వర్గాల సమాచారం ప్రకారం, ఫిబ్రవరి చివరలో జరిగిన దాడుల్లో మొజ్తాబా కాళ్లకు గాయాలయ్యాయని, ప్రస్తుతం ఆయన సురక్షిత ప్రాంతంలో చికిత్స పొందుతున్నారని తెలుస్తోంది.

ఇరాన్ అణ్వాయుధ తయారీపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హెచ్చరిక

హైదరాబాద్, సందేశం టైమ్స్, మార్చి 15, 2026, ప్రతినిధి శెట్టి వెంకటేష్: ఇరాన్ ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధాన్ని సాధించనివ్వబోమని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పష్టం చేశారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, ఇరాన్ అణ్వాయుధ దేశంగా మారడం అమెరికా భద్రతకే కాకుండా ప్రపంచ శాంతికి ముప్పు అని పేర్కొన్నారు. ప్రెసిడెంట్ ట్రంప్ నాయకత్వంలో ఇరాన్‌ను నియంత్రించడమే తమ ప్రధాన లక్ష్యమని, ఇందుకోసం తమ సైన్యం ఏ రకమైన త్యాగాలకైనా సిద్ధంగా ఉందని వాన్స్ స్పష్టం చేశారు. అగ్రరాజ్యం తన భద్రత విషయంలో రాజీపడబోదని, సైనికుల క్షేమం కోసం అమెరికాలోని 50 రాష్ట్రాల ప్రజలు ప్రార్థనలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, దౌత్య మార్గాల ద్వారా చర్చలు జరుపుతున్నప్పటికీ, అవసరమైతే కఠిన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని అమెరికా ఈ సందర్భంగా ఇరాన్‌కు తేల్చిచెప్పింది.

ఖర్గ్ ఐలాండ్ దాడుల నేపథ్యంలో ఇరాన్ ప్రతీకార హెచ్చరికలు

హైదరాబాద్, సందేశం టైమ్స్, మార్చి 15, 2026, ప్రతినిధి శెట్టి వెంకటేష్: ఇరాన్ ప్రధాన చమురు ఎగుమతి కేంద్రమైన ఖర్గ్ ఐలాండ్‌పై జరిగిన దాడులపై ఇరాన్ ప్రభుత్వం అత్యంత తీవ్రంగా స్పందించింది. తమ దేశ ఆర్థిక మూలాలపై దాడులు జరిగితే ఊరుకోబోమని, ఈ ఘటనకు తప్పకుండా ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. ముఖ్యంగా అమెరికాతో సంబంధం ఉన్న చమురు కంపెనీల మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటామని, వాటిని బూడిద కుప్పలుగా మారుస్తామని ఇరాన్ సాయుధ దళాలు ఘాటు హెచ్చరికలు జారీ చేశాయి. ఖర్గ్ ఐలాండ్‌లోని దాదాపు 90 సైనిక లక్ష్యాలను ధ్వంసం చేశామని అమెరికా ప్రకటించిన నేపథ్యంలో, ఇరాన్ తన చమురు నిల్వలను కాపాడుకోవడంతో పాటు ప్రత్యర్థి దేశాలకు గట్టి సమాధానం ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. చమురు కంపెనీలు అమెరికాతో సహకరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇరాన్ మిలిటరీ కమాండ్ స్పష్టం చేసింది.

మార్చి

# యుద్ధక్షేత్రంగా మారిన పశ్చిమ ఆసియా: ట్రంప్ తాజా హెచ్చరికల వెనుక అసలు కథ

హైదరాబాద్, సందేశం టైమ్స్, మార్చి 15, 2026, ప్రతినిధి శెట్టి వెంకటేష్: ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు ఇప్పుడు పరాకాష్టకు చేరుకున్నాయి. "ఇరాన్ సైనిక శక్తిని 100% మట్టికరిపించాం" అని ట్రంప్ చేసిన ప్రకటన అంతర్జాతీయ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. అసలు ట్రంప్ ఇలా ఎందుకు మాట్లాడారు? దీనివల్ల ప్రపంచానికి వచ్చే ముప్పు ఏంటి? అనే అంశాలను ప్రజల కోసం ప్రత్యేకంగా విశ్లేషిస్తున్నాం.

ఏమిటి ఈ 'తల తెగిన ఇరాన్' వ్యాఖ్య?

ట్రంప్ తన ప్రకటనలో ఇరాన్‌ను "తల తెగిన దేశం" అని సంబోధించారు. దీనికి రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి:

నాయకత్వ లోపం: ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ దాడుల్లో తీవ్రంగా గాయపడ్డారని అమెరికా రక్షణ శాఖ భావిస్తోంది. ఒక దేశానికి నాయకత్వం వహించే వ్యక్తి కనిపించకుండా పోతే ఆ దేశం దిక్కులేనిది అవుతుందని ట్రంప్ ఉద్దేశం.

సైనిక వైఫల్యం: ఇరాన్ యొక్క కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థలను, అంటే ఆదేశాలు ఇచ్చే కేంద్రాలను అమెరికా ధ్వంసం చేసింది. దీనివల్ల ఇరాన్ సైన్యం ఇప్పుడు ఒక పద్ధతి లేకుండా పోరాడుతోందని ట్రంప్ చెబుతున్నారు.

హార్ముజ్ జలసంధి.. ప్రపంచానికి ఎందుకు అంత ముఖ్యం?

హార్ముజ్ జలసంధి అనేది సముద్రంలో చాలా సన్నని మార్గం. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే 20% చమురు (Oil) ఈ మార్గం గుండానే వెళ్తుంది.

ఇరాన్ వ్యూహం: తనపై దాడులు ఆపకపోతే ఈ మార్గాన్ని మూసివేస్తామని ఇరాన్ బెదిరిస్తోంది. దీనివల్ల ఇప్పటికే పెట్రోల్ ధరలు ప్రపంచవ్యాప్తంగా ఆకాశాన్నంటాయి.

ట్రంప్ ప్లాన్: చైనా, జపాన్, ఫ్రాన్స్ వంటి దేశాలను నౌకలు పంపమని కోరడం ద్వారా ఇది కేవలం అమెరికా సమస్య కాదని, చమురు అవసరమైన ప్రతి దేశం రంగంలోకి దిగాలని ట్రంప్ కోరుతున్నారు. త్వరలోనే అమెరికా తన యుద్ధనౌకల రక్షణలో చమురు ట్యాంకర్లను నడిపించడానికి సిద్ధమవుతోంది.

తీర ప్రాంతంపై దాడులు ఎందుకు?

"తీర ప్రాంతంపై బాంబుల వర్షం కురిపిస్తాం" అని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ తన చిన్న చిన్న వేగవంతమైన పడవలు మరియు సముద్రపు మైన్ల ద్వారా పెద్ద నౌకలను ముంచేయడానికి ప్రయత్నిస్తోంది. వీటిని అడ్డుకోవడమే లక్ష్యంగా అమెరికా తీర ప్రాంత రక్షణ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంది.

సామాన్యులపై ప్రభావం ఎలా ఉంటుంది?

చమురు ధరలు: ఈ యుద్ధం వల్ల పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉంది. ఆర్థిక సంక్షోభం: హార్ముజ్ జలసంధి మూతపడితే ప్రపంచ దేశాల ఎగుమతులు, దిగుమతులు నిలిచిపోయి ఆర్థిక మాంద్యం వచ్చే ప్రమాదం ఉంది. అందుకే ట్రంప్ ఇప్పుడు ఇతర దేశాల మద్దతుతో ఇరాన్‌ను పూర్తిగా అణచివేసి, సముద్ర మార్గాలను తమ ఆధీనంలోకి తీసుకోవాలని చూస్తున్నారు.

## సల్మాన్ అలీ అఘా రనౌట్ వివాదం: క్రీడా స్ఫూర్తిపై మొదలైన చర్చ




హైదరాబాద్, సందేశం టైమ్స్, మార్చి 15, 2026, ప్రతినిధి శెట్టి వెంకటేష్: పాకిస్తాన్ మరియు బంగ్లాదేశ్ జట్ల మధ్య జరుగుతున్న వన్డే సిరీస్‌లో ఒక అనూహ్య రనౌట్ ఘటన తీవ్ర దుమారం రేపుతోంది. మార్చి 13న జరిగిన రెండో వన్డేలో పాక్ బ్యాటర్ సల్మాన్ అలీ అఘా ఔట్ అయిన తీరుపై క్రీడా స్ఫూర్తి (Spirit of Cricket) గురించి ఇరు దేశాల క్రికెటర్ల మధ్య మాటల యుద్ధం మొదలైంది. అసలు ఏం జరిగింది ? పాకిస్తాన్ ఇన్నింగ్స్ 39వ ఓవర్‌లో సల్మాన్ అఘా మరియు మహ్మద్ రిజ్వాన్ క్రీజులో ఉన్నారు. బంగ్లాదేశ్ బౌలర్ మెహిదీ హసన్ మిరాజ్ వేసిన బంతిని రిజ్వాన్ మెల్లిగా కొట్టగా, అది బౌలర్ వద్దకు వెళ్లింది. ఆ సమయంలో నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న సల్మాన్ అలీ అఘా క్రీజు వెలుపల ఉన్నాడు. బౌలర్ మిరాజ్ బంతిని పట్టుకోవడంలో ఇబ్బంది పడుతుండగా, సల్మాన్ అతనికి సహాయం చేయడానికి లేదా బంతిని అందించడానికి ప్రయత్నించాడు. అయితే, మిరాజ్ వెంటనే ఆ బంతిని అందుకుని వికెట్లను పడగొట్టాడు. ఆ సమయంలో సల్మాన్ క్రీజు బయట ఉండటంతో ఎంపైర్ అతడిని రనౌట్‌గా ప్రకటించారు. లిటన్ దాస్ ఘాటు సమాధానం ఈ ఘటనపై సల్మాన్ అఘా మరియు రమీజ్ రాజా అసహనం వ్యక్తం చేశారు. ఇది క్రీడా స్ఫూర్తికి విరుద్ధమని వారు వాదించారు. దీనిపై బంగ్లాదేశ్ కెప్టెన్ లిటన్ దాస్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు: "ఇది ఒక అంతర్జాతీయ మ్యాచ్, అంతేకానీ ఛారిటీ మ్యాచ్ కాదు. నిబంధనల ప్రకారం ఔట్ అయితే అది క్రీడా స్ఫూర్తిని ఉల్లంఘించినట్లు కాదు."ప్రతి ఒక్కరికీ తమ సొంత అభిప్రాయాలు ఉంటాయని, కానీ గ్రౌండ్‌లో నిబంధనలే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. స్పందించిన రమీజ్ రాజా మరియు సల్మాన్ అఘా మాజీ క్రికెటర్ రమీజ్ రాజా మాట్లాడుతూ, నిబంధనల ప్రకారం ఇది ఔట్ అయినప్పటికీ, బ్యాటర్ బౌలర్‌కు సహాయం చేసే క్రమంలో ఇలా చేయడం సరైన పద్ధతి కాదన్నారు. సల్మాన్ అఘా మాట్లాడుతూ, తను మిరాజ్ స్థానంలో ఉండి ఉంటే బహుశా అలా చేసేవాడిని కాదని, ఆటలో మానవీయ కోణం ఉండాలని అభిప్రాయపడ్డారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / యజమాని / సంపాదకురాలు: కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.